# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 10-12-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **వాట్సాప్ గవర్నన్స్ ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత అందుబాటులోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు.**
2. **రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉద్యోగులతో నిర్వహించిన 'మాటా-మంతి' కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈరోజు పాల్గొన్నారు.**
3. **విజయవాడ ఇంద్రకీలాద్రి ఆలయంలో రేపటి నుంచి ప్రారంభం కానున్న భవానీ దీక్ష విరమణల కోసం అన్ని ఏర్పాట్లు చేశామని హొంమంత్రి వి.అనిత తెలిపారు.**
4. **కృతిమ మేధ- ఏఐకు ఆంధ్రప్రదేశ్‌ను గమ్యస్థానంగా మారుస్తామని ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.**
5. **వాజ్ పేయి శతజయంతి సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా బస్సు యాత్రను నిర్వహించనున్నామని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు.**

===========================

వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత అందుబాటులోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ముఖ్యమంత్రి అధ్యక్షతన ఈరోజు రాష్ట్ర సచివాలయంలో మంత్రులు, కార్యదర్శులు, విభాగాధిపతులతో జరుగుతున్న సమావేశంలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి -జీఎస్‌డీపీ వృద్ధి రేటు పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలు, అమలు చేయాల్సిన ప్రణాళికపై ముఖ్యమంత్రి చర్చించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, విశాఖలో 1 గిగా వాట్ డేటా సెంటర్ ఏర్పాటు కానుందని చెప్పారు. ఎప్పటికప్పుడు నూతన సాంకేతికను అందిపుచ్చుకోవాలన్నారు. పునరుత్పాదక ఇంధన రంగంలో గ్రీన్ ఎనర్జీకి ప్రాధ్యానిస్తూ చర్యలు చేపడుతున్నామని ముఖ్యమంత్రి తెలియజేస్తూ,

వాయిస్. 35 ..సెకన్లు

అలాగే 2025-26 ఆర్థిక సంవత్సరంలోని మొదటి రెండు త్రైమాసికాల్లో సాధించిన ఆర్థిక ఫలితాలపై సమీక్ష నిర్వహించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 17.11 శాతం మేర వృద్ధి రేటు సాధించేలా కృషి చేయాలన్నారు. మూడు, నాలుగు త్రైమాసికాల్లో సాధించాల్సిన లక్ష్యాలపై ముఖ్యమంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు.

--------------------------

రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉద్యోగులతో 'మాటా–మంతి' పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి రెండు వేల మందికిపైగా ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సమస్యలను ఉపముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. పవన్ కల్యాణ్ మాట్లాడుతూ .. పంచాయతీ రాజ్ శాఖలో గ్రీన్ అంబాసిడార్లుగా పనిచేసే వారికి సర్పంచ్ లతో సంబంధం లేకుండా జీతాలను అందజేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ప్రజలకు మెరుగైన సేవలు అందించడంపై అధికారులకు పవన్ కళ్యాణ్ దిశానిర్దేశం చేశారు.

---------------------------

రాజధాని అమరావతిలోని వడ్లమాను గ్రామ రైతులతో పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ ఈరోజు సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైల్వే ట్రాక్, రైల్వే స్టేషన్, ఇన్నర్ రింగ్ రోడ్, స్పోర్ట్స్ సిటీ కోసం భూసమీకరణ అవసరమని తెలిపారు. ఇందుకోసం వడ్లమానులో 1,768 ఎకరాలను ల్యాండ్ పూలింగ్ ద్వారా సమీకరించనున్నామని తెలిపారు.

---------------------------

కృత్రిమ మేధ– ఏఐకు ఆంధ్రప్రదేశ్ ను గమ్యస్థానంగా మారుస్తామని ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. అమెరికా శాన్ ఫ్రాన్సిస్కోలోని సిలికాన్ వ్యాలీలో జరిగిన బే ఏరియా కౌన్సిల్ సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ఏఐ యుగంలో నైపుణ్యాలు, మార్పును సమన్వయం చేయడం అనే అంశంపై మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. భవిష్యత్‌లో ఆంధ్రప్రదేశ్ ను 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఆటోమోటివ్, పునరుత్పాదక శక్తి, ఎలక్ట్రానిక్స్, కృత్రిమ మేధ వంటి 20 రంగాలను గుర్తించామని, ఆయా రంగాలను క్లస్టర్ విధానంలో అభివృద్ధి చేస్తామని మంత్రి వివరించారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వంలో ఎన్నికల సంఘంతో సహా అన్ని రాజ్యాంగ సంస్థలు మరింత పారదర్శకంగా మారుతున్నాయని కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ అన్నారు. ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా సమగ్ర సవరణ –సర్‌పై కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ వ్యాఖ్యలను ఆయన ఖండించారు. ఈ మేరకు కేంద్రమంత్రి ఈరోజు స్పందిస్తూ, అక్రమ వలసదారులను తొలగించడంతోపాటు ఓటరు జాబితాల సమగ్రతను కాపాడటమే లక్ష్యంగా సవరణ జరుగుతోందని తెలిపారు.

---------------------------

విజయవాడ ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో భవానీ దీక్ష విరమణల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశామని హోంమంత్రి వి.అనిత తెలిపారు. రేపటి నుండి భవానీ దీక్షా విరమణలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆలయంలో చేపట్టిన ఏర్పాట్లను మంత్రి పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, రేపటి నుంచి ఐదు రోజుల పాటు వీఐపీ దర్శనాలను రద్దు చేస్తున్నామన్నారు. దీక్ష విరమణలో దాదాపు 6 లక్షల మందికి పైగా భక్తులు వస్తారని అంచనా వేస్తున్నామని, రద్దీకి తగిన ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి వెల్లడిస్తూ,

వాయిస్ 22 సెకన్లు

---------------------------

మాజీ ప్రధానమంత్రి , భారతరత్న అటల్ బిహార్ వాజ్ పేయీ శతజయంతి సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా బస్సు యాత్రను నిర్వహించనున్నామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. అమరావతిలో మంత్రి నిన్న మాట్లాడుతూ, అనంతపురం జిల్లాలోని ధర్మవరంలో రేపు యాత్ర ప్రారంభమవుతుందని చెప్పారు. దేశ సమైగ్రతకు ప్రధానమంత్రిగా వాజ్ పేయీ చేసిన కృషిని వివరిస్తామని సత్యకుమార్ యాదవ్ తెలియజేస్తూ,

వాయిస్ 32 సెకన్లు

---------------------------

ప్రపంచంలో ఎవరు ఎటువంటి వివక్షకు గురి కాకుండా సమాన హక్కులతో జీవించాలన్న అంశంపై అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో ఈరోజు అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం నిర్వహిస్తున్నారు. మనిషి స్వతంత్రంగా జీవించడానికి, మనుగడ కాపాడుకోవడానికి హక్కులు కలిగి ఉండడం అత్యవసరమని భావించిన ప్రపంచ దేశాలు ఐక్య రాజ్య సమితి ఆధ్వర్యంలో 1948 డిసెంబర్ 10 వ తేదీన ఒక ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని అప్పటి నుండి ప్రతి ఏటా ఈ కార్యక్రమం జరుగుతోంది. "మానవ హక్కులు-మన రోజువారి అవసరాలు" అనే ఇతివృత్తంతో ఈ ఏడాది మానవ హక్కుల దినోత్సవం నిర్వహిస్తున్నారు.

---------------------------

క్రిస్టమస్, నూతన సంవత్సరం సందర్భంగా ప్రయాణికుల రద్దీ నేపథ్యంలో ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. 07196 నెంబర్ కలిగిన ప్రత్యేక రైలు చర్లపల్లి నుంచి కాకినాడకు ఈ నెల 24 నుంచి 30 వరకు బుధ, మంగళవారాల్లో రాత్రి 7 గంటల 30 నిమిషాలకు బయల్దేరుతుందని, 07195 నెంబర్ కలిగిన రైలు కాకినాడ నుంచి చర్లపల్లికి ఈ నెల 28 నుంచి 31 వరకు ఆది, బుధవారాల్లో రాత్రి 7 గంటల 50 నిమిషాలకి బయల్దేరుతుందని తెలిపింది. అలాగే ఈనెల 16 నుంచి జనవరి 4వ తేదీ వరకు వారాంతపు ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే పేర్కొంది. 07000 నెంబర్ గల తిరుపతి-చర్లపల్లి రైలు ఈ నెల 16 నుంచి 30 వరకు ప్రతి మంగళవారం నడుపుతామని వెల్లడించింది.

---------------------------

తిరుమలలో వైకుంఠ ఏకాదశి ప్రత్యేక దర్శన ఏర్పాట్లపై తిరుమల తిరుపతి దేవస్థానం – టిటిడి ఈరోజు ఉన్నతస్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించింది. తిరుమలలోని అన్నమయ్య భవనంలో జరిగిన సమావేశంలో తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, టిటిడి విజిలెన్స్, సెక్యూరిటీ ఆఫీసర్ మురళీకృష్ణ పాల్గొని తిరుమలలో భక్తుల రద్దీ, భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, శాంతి భద్రతలు వంటి ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమలలో భక్తుల రద్దీ భారీగా ఉండే ప్రాంతాలను ముందుగానే గుర్తించి, అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

=====================